# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-04-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఆంధ్ర ప్రదేశ్,తెలంగాణా రాష్ట్రాలతో సహా దేశ వ్యాప్తంగా పది రాష్ట్రాలలో జరగనున్న నాలుగవ విడత పోలింగ్ కు రేపు నోటిఫికేషన్ విడుదల అవుతుంది.

2. దేశ వ్యాప్తంగా ఈ రోజు శ్రీ రామ నవమి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రముఖ పుణ్య క్షేత్రం భద్రాచలంలో శ్రీ సీతారాముల కళ్యాణ వేడుక కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది.

3. సివిల్స్ 2023 పరీక్షలలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.

4. గల్ఫ్ లో ఉపాధి పొందుతున్న తెలంగాణా వాసులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు

5. వేసవి దృష్ట్యా ఆంధ్ర ప్రదేశ్ లో అన్ని నీటి ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపాలని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

6. ఈ రోజు ప్రపంచ హీమోఫీలియా అవగాహనా దినం నిర్వహిస్తున్నారు.

==========================

ఆంధ్ర ప్రదేశ్,తెలంగాణా రాష్ట్రాలతో సహా దేశ వ్యాప్తంగా వచ్చే మే 13 వ తేదీన జరగనున్న నాలుగవ విడత పోలింగ్‌కు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం రేపు నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఆంధ్ర ప్రదేశ్ లో 175 శాసన సభా స్థానాల ఎన్నికలకు కూడా రేపే నోటిఫికేషన్ విడుదల అవుతుంది. నోటిఫికేషన్ విడుదలతోనే నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 25వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా ఏప్రిల్ 26 వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29 చివరి తేదీ కాగా మే 13 వ తేదీన నాలుగవ విడత ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. జూన్ నాలుగవ తేదీన ఫలితాలు వెలువడతాయి. కాగా ఏడు విడతలుగా జరిగే మొత్తం ఎన్నికల ప్రక్రియ ఏప్రిల్ 19 వ తేదీన ప్రారంభమై జూన్ ఒకటవ తేదీన ముగుస్తుంది. ఎన్నికలలో పోటీ చేసే అన్ని ప్రధాన పార్టీలు తమ తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. ఎన్నికల మ్యానిఫెస్టోలను కూడా ప్రకటించాయి. మరొక వైపువివిధ రాజకీయ పార్టీలు ముమ్మర స్థాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి.

-------------------------

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రేపు,ఎన్నికల నోటిఫికేషన్ విడుదల సందర్భంగా నామినేషన్ల ప్రక్రియకు సర్వ సన్నద్ధం కావాలని ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలక్టర్ లకు సూచించారు.ఆయన నిన్న సచివాలయం నుండి దృశ్య మాధ్యమం ద్వారా నామినేషన్ల ప్రక్రియ,తదితర అంశాల పై జిల్లా కలక్టర్లతో సమీక్షించారు.

---------------------------

భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణం ప్రత్యక్షప్రసారానికి ఎన్నికల సంఘం అనుమతిచ్చింది.లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాములవారి కల్యాణం ప్రత్యక్ష ప్రసారం చేయకూడదని ఏప్రిల్ 4న ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. గత 40 ఏళ్లుగా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని, ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరుతూ తెలంగాణ దేవాదాయశాఖ ఎన్నికల సంఘానికి లేఖ రాసింది.దీంతో స్పందించిన ఎన్నికల సంఘం కల్యాణ మహోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

కడప జిల్లా ఒంటిమిట్ట కోదండ రామ స్వామి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు కన్నుల పండువగా జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఈ రోజు నుండి ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 25 వ తేదీ వరకు కొనసాగే ఈ బ్రహ్మోత్సవాలు గత రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి.ఈ రోజు,రేపు కవి సమ్మేళనం జరగనుండగా బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఆధ్యాత్మిక,భక్తి సంగీత కార్యక్రమాలు జరుగుతాయి.

---------------------------

శ్రీ రామ నవమి సందర్భంగా అయోధ్య లో ఈ రోజు బాల రాముని నుదిటిపై సూర్య తిలకాన్ని దిద్దే అపురూప ఘట్టం జరగనున్నది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అయోధ్య ఆలయ ప్రాంగణంలో వంద ఎల్. ఇ. డి.తెరలను ఏర్పాటు చేశారు. కాగా 75 మిల్లి మీటర్ల వ్యాసార్థంతో దాదాపు ఆరు నిమిషాల పాటు బాల రాముని విగ్రహంపై సూర్య కిరణాలు ప్రసరించనున్నాయి. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు రామ జన్మ భూమి ట్రస్టు ఏర్పాట్లు చేస్తోంది.

---------------------------

డ్వాక్రా బృందాలను ప్రభావితం చేసే విధంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్ట వద్దని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న దృష్ట్యా స్వయం సహాయక బృందాలను ప్రభావితం చేసేలా నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వ ఉన్నతాధికారులకు సూచించారు. ఈమేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖలకు ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది స్వయం సహాయక బృందాలను ప్రభావితం చేసేలా ఎలాంటి కార్యకలాపాలు చేపట్టొద్దని స్పష్టం చేశారు. అవగాహన పేరుతో సమావేశాల నిర్వహణ, సర్వే తదితర కార్యక్రమాలు నిర్వహించకూడదని సెర్ప్ సీఈవో, మెప్మా మిషన్ డైరెక్టర్లను ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు.

---------------------------

దేశ వ్యాప్తంగా ఈ రోజు శ్రీ రామ నవమి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో వాడ వాడలా చలువ పందిళ్ళు వేసి శ్రీ సీతారాముల కళ్యాణ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు.

---------------------------

సివిల్స్ – 2023 పరీక్షలలో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడి శుభాకాంక్షలు తెలియజేశారు.పట్టుదల,అంకిత భావంతో అభ్యర్థులు సాధించిన ఈ విజయం ప్రజా సేవకు నాంది పలికిందని ఆయన సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. రాబోయే రోజులలో సివిల్స్ విజేతల కృషి దేశ భవిష్యత్తును తీర్చి దిద్దుతుందని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు.

---------------------------

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్–యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ తుది ఫలితాల్లో తెలంగాణా లోని మహబూబ్నగర్‌కుచెందిన అనన్య రెడ్డి మూడో ర్యాంకు సాధించారు.తెలుగు రాష్ట్రాలకు చెందిన నందల సాయికిరణ్ 27 వ ర్యాంకు, మేరుగు కౌశిక్ 82 వ ర్యాంకు సాధించగా...మొత్తం 30 మంది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు వెయ్యి లోపు ర్యాంకులు సాధించారు.ఈ ఫలితాల్లో 1016 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా.. ఇందులో జనరల్ విభాగంలో 347 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 115, ఓబీసీ నుంచి 303, ఎస్సీ కేటగిరీలో 165, ఎస్టీ కేటగిరీలో 86 మంది చొప్పున ఎంపికయ్యారు.

---------------------------

గల్ఫ్ లో ఉపాధి పొందుతున్న తెలంగాణా వాసులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో ఆయన నిన్న హైదరాబాద్ లో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గల్ఫ్ ఏజెంట్లకు చట్టబద్ధత ఉండేలా చర్యలు తీసుకుంటామనీ, వారి ద్వారా మాత్రమే కార్మికులు విదేశాలకు వెళ్లాలనీ సూచించారు.సమావేశంలో నేతలు వివిధ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో 15 లక్షల కుటుంబాలు గల్ఫ్ ఉపాధిపై ఆధారపడి ఉన్నాయనీ, వారి సమస్యలను పరిష్కరిస్తామనీ రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో గత 58 నెలల కాలంలో ఫిషింగ్ హార్బర్లు ,సచివాలయాలు ,నాడు నేడు పాఠశాలలు ,కొత్త వైద్య కళాశాలలు, పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసామని వై. ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య మంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిన్న జరిగిన “మేమంతా సిద్దం’ సభలో ఆయన ప్రసంగిస్తూ స్వయం ఉపాధి రంగాలకు పెద్ద పీట వేసామనీ, లంచాలు,వివక్షతకు తావు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేసామనీ తెలిపారు. స్వయం ఉపాధి రంగం బలోపేతం కోసం పలు పథకాల ద్వారా సాయం చేశామని జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

వేసవిలో ఎలాంటి త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని వేసవి నీటి ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. ఎస్. జవహర్ రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. వేసవిలో త్రాగునీటి సరఫరా,జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం,విద్యుత్ సరఫరా,తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆయన నిన్న సచివాలయం నుండి దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ నీటి నిల్వలననుసరించి వేసవి మొత్తం త్రాగునీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించుకోవాలని ముఖ్యంగా శివారు ప్రాంతాలలోని తాగునీటి వనరులన్నింటినీ నీటితో నింపేందుకు చర్యలు తీసుకోవాలనీ సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు వెంటనే పూర్తి చేయాలనీ,శ్రామికులు పనిచేసే ప్రదేశంలో టెంట్లు,త్రాగునీరు వంటి తగిన సౌకర్యాలు కల్పించాలనీ జవహర్ రెడ్డి ఆదేశించారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ హీమోఫీలియా అవగాహనా దినం నిర్వహిస్తున్నారు. అరుదైన వ్యాధిగా వైద్య నిపుణులు పేర్కొనే ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి చిన్న గాయం తగిలినా రక్త స్రావం జరుగుతుంది. జన్యు లోపం కారణంగా వారసత్వంగా ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ఇటువంటి లోపం వున్న వారు స్క్రీనింగ్ పరీక్ష ద్వారా దీనిని గుర్తించి హిమోఫీలియా వ్యాధిని నియంత్రించ వచ్చునని కూడా వారు సూచిస్తున్నారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫీలియా వ్యవస్థాపకులు ఫ్రాంక్ ష్నాబల్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఏప్రిల్ 17 వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో వై. ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని తెలుగుదేశం, జనసేన,భారతీయ జనతా పార్టీ కూటమి నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కనకమేడల రవీంద్ర, నాదెండ్ల మనోహర్, GVL నరసింహారావు ఎన్నికల సంఘాన్ని కలసి వినతి పత్రం సమర్పించారు. విపక్ష నేతలను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందనీ, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలనీ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వీడియో రికార్డింగ్ చేపట్టాలని వారు వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే 4 రోజులపాటు అక్కడక్కడా 44-46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈరోజు 46 మండలాల్లో తీవ్ర వడగాలులు, 175 మండలాల్లో వడగాలులు,రేపు 67 మండలాల్లో తీవ్ర వడగాలులు, 213 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది.

=====================